సామాన్యుడి ఆయుధం
# తెలంగాణ ప్రభ
శుక్రవారం, ఆగస్టు 09, 2024
డిజిటల్



# హైదరాబాద్‌లో ఛార్లెస్ స్క్వాబ్

- భారత్‌లో తొలి ఇండస్ట్రీ కొత్తగా టెక్నాలజీ
- డెవెలప్మెంట్ సెంటర్ డల్లాస్లో సీఎంతో కంపెనీ ప్రతినిధుల చర్చలు

తెలంగాణ ప్రభ, హైదరాబాద్ : ఫైనాన్షియల్ సర్వీసెస్ లో ప్రపంచంలో పేరొందిన చార్లెస్ స్క్వాబ్ కంపెనీ హైదరాబాద్ లో టెక్నాలజీ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. భారత్‌లోనే ఈ కంపెనీ నెలకొల్పే మొదటి సెంటర్ ఇదే కావటం విశేషం. అమెరికా పర్యటనలో భాగంగా డల్లాస్ లో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబుతో ఈ కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు డెన్నిస్ హోవార్డ్, రామ బొక్కా సారథ్యంలో ప్రతినిధులు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా టెక్నాలజీ అండ్ డెవెలప్మెంట్ సెంటర్ ఏర్పాటుపై కీలక నిర్ణయాన్ని వెల్లడించారు. హైదరాబాద్‌లో ఈ కేంద్రం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. కంపెనీ కార్యకలాపాలను వేగవంతం చేసేందుకు అవసరమైన మార్గదర్శనం చేస్తామని చెప్పారు. తమ కంపెనీ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతుకు కంపెనీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు ఛార్లెస్ స్క్వాబ్ తుది అనుమతుల కోసం వేచి చూస్తోంది. త్వరలోనే తమ ప్రతినిధి బృందాన్ని హైదరాబాద్‌కు పంపించనున్నట్లు తెలిపింది. ఈ కంపెనీ విస్తరణతో ఆర్థిక సేవల రంగంలోనూ హైదరాబాద్ ప్రపంచం దృష్టిని ఆకర్షించనుంది.

WANTED
సమాజంపై అవగాహన, బాధ్యత కలిగి నిజాన్ని నిర్భయంగా రాయగలిగి, మంచికోసం పని చేయగలనని నమ్మకం ఉన్న ప్రతి ఒక్క రిపోర్టర్‌కి
'తెలంగాణ ప్రభ డిజిటల్ పత్రిక'
ఆహ్వానం పలుకుతుంది. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం.. కొత్త వారికి అవకాశం కల్పిస్తున్నది.
ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి
సెల్: 99854 44342




## 'కల్యాణలక్ష్మి' ఒక వరం

**తెలంగాణ ప్రభ (కుత్బుల్లాపూర్) :** గాజుల రామారం డివిజన్ దేవేందర్ నగర్ ఎమ్మార్వో కార్యాలయం లో నిర్వహించిన 'కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్' చెక్కుల పంపిణీ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై 341 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.పి వివేకానంద్ మాట్లాడుతూ కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి ఇంటిలోని ఆడబిడ్డ తల్లిదండ్రులకు భారం కాకూడదని మెట్టినింట గౌరవాన్ని పొందాలనే ఆలోచనతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలలో నా భూతో నా భవిష్యత్ అనే విధంగా ప్రవేశపెట్టిన పథకం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలని అన్నారు. ప్రజా సంక్షేమం కోసం బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్వో అబ్దుల్ రహమాన్ ఖాన్, డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున్‌రావు, కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, ఆర్.ఐ లు రజనీకాంత్, రేణుక, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఎంపీ జన్మదిన వేడుకలు

**తెలంగాణ ప్రభ (కోటగిరి) :** పోతంగల్ మండల కేంద్రంలోని జహీరాబాద్ పార్లమెంటు సభ్యులు సురేష్ షేట్కార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పుప్పాల శంకర్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ఎంపీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. మండల అధ్యక్షులు పుప్పాల శంకర్ మాట్లాడుతూ.. జహీరాబాద్ ఎంపీ నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుతున్నామన్నారు. కార్యక్రమంలో డీసీసీ డెలిగేట్ సుంకిని హనుమంతు, బీసీ సెల్ అధ్యక్షులు కోడిచర్ల నాగేష్, మాజీ సర్పంచ్ ఈర్వంత్, చిన్నిబాబు, కోడిచర్ల కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు పాల్గొన్నారు.



## నేడు ఆవుపాల పంపిణీ

**తెలంగాణ ప్రభ (కోటగిరి) :** పోతంగల్ మండల కేంద్రంలోని నాగుల పంచమి పండుగను పురస్కరించుకుని స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు ఆవు పాలు పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సీతలే మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు.

# ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలి

- స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో పిలుపునిచ్చిన హనుమంతురెడ్డి



**తెలంగాణ ప్రభ (కుత్బుల్లాపూర్) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛతనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హనుమంత్ రెడ్డి కుత్బుల్లాపూర్ కమిషనర్ నరసింహ ఏఎంఓహెచ్ భార్గవ్ తో కలిసి జీడిమెట్ల విలేజ్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా హనుమంతు రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్ తరాలకు మొక్కలు ఎంతో తోడ్పాటు ఇస్తాయని స్వచ్ఛమైన గాలి వర్షాలు కురవడానికి పాటుపడతాయని అన్నారు అదే విధంగా ప్రతి ఒక్కరు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని స్వేచ్ఛగా ఉండాలని ఎప్పటికప్పుడు పరిసరాలు శుభ్రం చేసుకుని ఇలాంటి వ్యాధులు రాకుండా చూసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు తమ్ముని శ్రావణ్ కుమార్, డివిజన్ అధ్యక్షుడు బేక్ శ్రీనివాస్, కుమ్మరి సంతోష్ కుమార్ ,మధుసూదన్ రెడ్డి, బాలప్ప, రంగయ్య, పెంటయ్య, పుల్ల రాజ్, నర్సింగ్ రావు, బీజే కిరణ్, లక్ష్మీ, పద్మ లక్ష్మి, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.



## సిరిసిల్ల జిల్లా గోపాలమిత్ర అధ్యక్షుడిగా భాస్కర్

**తెలంగాణ ప్రభ, (సిరిసిల్ల) :** రాజన్న సిరిసిల్ల జిల్లా గోపాలమిత్ర యూనియన్ అధ్యక్షులుగా ఎం భాస్కర్ ఎన్నికయ్యారు. గురువారం సిరిసిల్ల నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో జిల్లా అధ్యక్షులుగా భాస్కర్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా బానోత్ ప్రవీణ్ నాయక్, కార్యదర్శిగా రంజాన్, ప్రచార కార్యదర్శిగా సంతోష్, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగాల దినేష్, చిన్నోజి, అజయ్, సతీష్ ఎన్నికయ్యారు.

# శాస్త్రీయ విధానాలు అలవర్చుకోవాలి

## వర్ణం వెంకటరెడ్డి, రైతు సంఘం నాయకులు




**తెలంగాణ ప్రభ, (సిరిసిల్ల) :** విద్యార్థులు శాస్త్రీయ విధానాలు అలవర్చుకోవాలని రైతు సంఘం నాయకులు వర్ణం వెంకటరెడ్డి అన్నారు. గురువారం సిరిసిల్లలోఎస్ఎఫ్ఐ జిల్లాస్థాయి విద్య వైజ్ఞానిక శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ తరగతులు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ అధ్యక్షతన జరిగాయి. శాస్త్రీయ ఆలోచన గతి తార్కిక భౌతిక వాదం అనే అంశంపై విద్యార్థులకు రైతు సంఘం నాయకులు వర్ణం వెంకటరెడ్డి బోధించారు. సమస్యలన్నింటికీ శాస్త్రీయ పరిష్కారం ఉంటుందని సమాజానికి ఉపయోగపడేలా విద్యార్థులు ఆలోచన విధానాన్ని అలవర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్, యుటిఎఫ్ జిల్లా నాయకులు పాకాల శంకర్ గౌడ్, జన విజ్ఞాన వేదిక నాయకులు రామరాజు, ఎరవల్లి నాగరాజు, హలో నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.



# గిరిజనుల అభివృద్ధికి నమూనాలు

- మారుమూల ఆదివాసీ గూడేల్లో అభివృద్ధి జరగాలి
- అడవుల పునరుద్ధరణపై దృష్టి సారించాం
- మైనింగ్ కంపెనీలతోనే అడవుల నాశనం
- అంతర్జాతీయ సదస్సులో మంత్రి సీతక్క




**తెలంగాణ ప్రభ, (హైదరాబాద్) :** రాష్ట్రంలో గిరిజనుల అభివృద్ధి కోసం స్థానిక అభివృద్ధి నమూనాను రూపొందించాలని పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సీతక్క మేధావులను కోరారు. ఆ మోడల్ ను అమలు చేయడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆమె చెప్పారు. గిరిజనుల అభివృద్ధి కోసం ఎన్నో చట్టాలు ఉన్నప్పటికీ అనుకున్న స్థాయిలో ఆ జాతుల అభివృద్ధి జరగడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో ఒక వైపు అభివృద్ధి జరుగుతుంటే,మరో వైపు ఏజెన్సీ ప్రాంతాలు సమస్యలతో సతమతమవుతున్నాయని అన్నారు. దేశంలోని మారుమూల ప్రాంతాలు, ఆదివాసీ గూడేల అభివృద్ధి జరిగినప్పుడే నిజమైన అభివృద్ధి జరిగినట్లు అని ఆమె తెలిపారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్ లో "గిరిజన జీవనోపాధి పద్ధతులు – సాధికారత, సమస్యలు" అనే అంశంపై డా. బి. ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ లో అంతర్జాతీయ సదస్సు జరిగింది.

ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సీతక్క మాట్లాడుతూ.. సహజవనరులు అపారంగా ఉన్న అటవీ సంపదను కొందరు స్వార్థపరులు కొల్లగొడుతున్నారని ఆమె ఆరోపించారు. మైనింగ్ కంపెనీలు అడవులను నాశనం చేస్తున్నాయని ఆమె మండిపడ్డారు. ఈ నేపథ్యంలో అడవులను ఆదివాసులు విధ్వంసం చేస్తున్నారనే దుష్ప్రచారం తగదన్నారు.

ఇంకా కొద్దోగొప్పో అడవులు మిగలడానికి కారణం ఆదివాసీ బిడ్డలనే అనే విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. అడవుల ఆధారంగా బతికే గిరిజనులు అడవులను ఎప్పుడు నాశనం చేయరన్నారు. ఎవరికీ హానీ తలపెట్టని ఆదివాసీయులు గత కొన్నేళ్ళుగా హక్కుల కోసం పోరాటం చేస్తున్నారని అన్నారు. ఆదివాసీయులకు హక్కులు దక్కకుండా అణచివేస్తోన్న నేపథ్యంలో వారి తరపున మేధావులు మాట్లాడాలని ఆమె కోరారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు ఆదివాసీ గూడేల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సీతక్క వెల్లడించారు. ప్రభుత్వం చేపట్టిన గ్రామీణ అభివృద్ధి కార్యకలాపాల్లో పలు కార్పోరేట్ సంస్థలు తమ బాధ్యతగా సహకారం అందజేస్తున్నాయని ఆమె తెలిపారు. రాష్ట్రంలోని క్షీణిస్తోన్న అటవీ ప్రాంతాల్లో అడవుల పునరుద్ధరణపై ప్రభుత్వం దృష్టి సారించిందని ఆమె తెలిపారు.

ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ మాజీ డీన్ ఆచార్య జి. హరగోపాల్, బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇ. సుధారాణి, వర్సిటీ అకాడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ జి. పుష్ప చక్రపాణి, సదస్సు డైరెక్టర్ ప్రొఫెసర్ గుంటి రవీందర్, వర్సిటీ సామాజిక శాస్త్రం విభాగ డీన్ ప్రొఫెసర్ వడ్డాణం శ్రీనివాస్, సదస్సు కో డైరెక్టర్ ప్రొఫెసర్ జి. లక్ష్మీ, వర్సిటీ పలు విభాగాలు డీన్లు, అధ్యాపకులు, పరిశోధన విద్యార్థులు పాల్గొన్నారు.




## మనుకు రూ.30లక్షల నజరానా

**ఫ్రాన్స్ :** పారిస్ ఒలింపిక్స్‌లో రెండు కాంస్యాలతో చరిత్ర సృష్టించిన భారత షూటర్ మను బాకర్ కు కేంద్ర క్రీడాశాఖ రూ.30 లక్షల నజరానా అందజేశారు. బుధవారం ఆమె భారత్ కు తిరిగి రాగా అభిమానులు ఢిల్లీలో ఘన స్వాగతం పలికారు. గురువారం మనుబాకర్ కేంద్ర క్రీడా శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియాను కలిసింది. చారిత్రాత్మక విజయం సాధించిన మనును కేంద్ర మంత్రి అభినందించారు. దేశం మొత్తం ఆమెను చూసి గర్విస్తోందని, మను సాధించిన విజయం భారత క్రీడా ప్రపంచంలోని యువతకు స్ఫూర్తినిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా ఆమెను ఘనంగా సత్కరించారు.రూ. 30 లక్షల నగదును అందజేశారు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో మను బాకర్ దేశానికి తొలి పతకం అందించింది. అలాగే, అదే విభాగంలో మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో సరబ్‌జోత్ సింగ్‌తో కలిసి మరో కాంస్యాన్ని సొంతం చేసుకున్నది.

# ఎస్సీ వర్గీకరణ విజయసారథి మంద కృష్ణమాదిగ

### ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు ఈ నెల 13న వస్తున్న సందర్భంగా

## విజయోత్సవ ర్యాలీ జయప్రదం చేయండి




**తెలంగాణ ప్రభ (కుత్బుల్లాపూర్) :** విజయోత్సవ ర్యాలీ ఘనంగా నిర్వహించాలని మేడ్చెల్ జిల్లా సన్నాహక సమావేశాన్ని కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సూరారం అంబేద్కర్ భవనంలో నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మున్నంగి నాగరాజు మాదిగ పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సి వర్గీకరణ కోసం ముప్పై ఏళ్లుగా పోరాటం చేసి మాదిగ జాతి చిరకాల లక్ష్యమైన వర్గీకరణని సాధించిన సందర్భగా ఘనంగా స్వాగత తెలియజేయాలనీ ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు మున్నంగి నాగరాజు మాదిగ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేశపగా రాంచందర్ మాదిగ ఎం ఎస్ పి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వైకే విశ్వనాథ్ మాదిగ, ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్ మాదిగ,మేకల నగేష్ మాదిగ, బూరు రవి మాదిగ, డప్పు రామస్వామి మాదిగ,ఎర్రోళ్ల బాబు మాదిగ,తోకల చిరంజీవి మాదిగ, ముక్కెర్ల లాలయ్యమాదిగ,కోలేపాక వెంకట్, సిలువరు శ్రీనివాస్ మాదిగ, జోగు వెంకట్,రసమళ్ళ యాదగిరి, సలోమి, బచ్చల కూర స్వామి,వల్లూరు బాబు మాదిగ, పి గణేష్, పి నరేష్,దూలపల్లి శ్రావణ్ మాదిగ, ఎర్రోళ్ల నర్సింగ్,దీపు మాదిగ,అనిల్ మాదిగ, నియోజకవర్గ ,జిల్లా, రాష్ట్ర, జాతీయ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



## గెజిటెడ్ ఉద్యోగం సాధించిన విద్యాసాగర్


### 256 ర్యాంక్‌తో సత్తా చాటిన గిరిజన బిడ్డ

**తెలంగాణ ప్రభ, (నర్సంపేట) :** పంచాయతీ రాజ్ డిపార్ట్‌మెంట్‌లో తేజావత్ విద్యాసాగర్ గెజిటెడ్ ఉద్యోగం సాధించారు. వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని బాల్ తండాకు చెందిన విద్యాసాగర్ ఇటీవలే వెల్లడించిన ఫలితాల్లో ఏఈఈ గా ఉద్యోగం సంపాదించాడు. రాష్ట్రంలో 256 ర్యాంక్‌తో సత్తాచాటాడు. గిరిజన కుటుంబంలో పుట్టిన విద్యాసాగర్ చిన్ననాటి నుంచి చదువులో చురుగ్గా ఉండేవాడు. ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా కొన్ని సంవత్సరాలుగా కష్టపడుతున్నాడు. పంచాయతీ రాజ్ డిపార్ట్ మెంట్ లోనే ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో సొంతంగానే పరీక్షలకు సన్నద్ధమయ్యాడు. నర్సంపేటలోని గ్రంథాలయాలను వినియోగించుకుని పరీక్షకు హాజరయ్యాడు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ.. 'పంచాయతీ రాజ్ డిపార్ట్ మెంట్ లో గ్రూప్ 1 స్థాయి గెజిటెట్ ఉద్యోగం రావడం ప్రజలకు విస్తృతమైన సేవలు అందించేందుకు ఉపయోగపడుతుందని ఆశిస్తున్నా. కొన్నేళ్లుగా పడిన కష్టానికి ప్రతిఫలం దక్కిందని భావిస్తున్నా. నా ఉద్యోగ సన్నద్ధత ప్రయాణంలో వెన్నంటి నిలిచిన నా తల్లిదండ్రుల సహకారం మరువలేను' అని అన్నారు.



## కోటగిరిలో ఎంపీ పుట్టినరోజు వేడుకలు

**తెలంగాణ ప్రభ (కోటగిరి) :** కోటగిరి మండల కేంద్రంలోని డిసిసి ఉపాధ్యక్షులు గంగాధర్ దేశాయ్ ఆధ్వర్యంలో జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం సందర్భంగా గంగాధర్ దేశాయ్ ...మాట్లాడుతూ కోటగిరి మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల తరపున జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఎల్లవేళలా సంతోషంగా ఉండాలని దేవుని వేడుకుంటున్నామన్నారు. కోటగిరి మండలానికి అభివృద్ధి చేయాలని ఈ జన్మదిన వేడుకలు సందర్భంగా తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ కార్యదర్శి వహీద్, జంగం సాయిలు, భూమయ్య , ఫిరోజ్, యయ్యా ఖాన్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# నాగచైతన్యతో శోభిత నిశ్చితార్థం

అక్కినేని వారింట మరోసారి పెండ్లి బాజాలు మోగనున్నాయి. సమంతతో విడాకులు తీసుకున్న నాగచైతన్యకు తాజాగా నటి శోభితా ధూళిపాళ్లతో నిశ్చితార్థం జరిగింది. ఈ విషయాన్ని ఆయన తండ్రి హీరో నాగార్జున ప్రకటించారు. గురువారం ఉదయం ఈ జంటకు నిశ్చితార్థం జరిగిందని ఆయన తెలిపారు. ఆమెను తమ కుటుంబంలోకి సంతోషంగా స్వాగతిస్తున్నామని నాగార్జున అన్నారు. అలాగే ఈ ప్రేమ, సంతోషం జీవితాంతం కొనసాగాలని నాగార్జున ఆకాంక్షించారు. 8.8.8.. హద్దులేని ప్రేమకు నాంది ఈ రోజు అని అన్నారు. ఈ హ్యాపీ కపుల్‌కు శుభాకాంక్షలు తెలిపారు. వీరి నిశ్చితార్థం ఇరు కుటుంబాల సమక్షంలో చాలా సింపుల్ గా జరిగినట్లు తెలుస్తోంది. కాగా, 2017లో నటి సమంత, నాగచైతన్య ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అయితే, ఆ తర్వాత ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో కొంతకాలం దూరంగా ఉన్నారు. అనంతరం 2021 అక్టోబర్‌లో విడిపోతున్నట్టుగా ప్రకటించారు. ఆ తర్వాత కొంతకాలానికి చైతూ-శోభిత జంటపై పుకార్లు మొదలయ్యాయి. ఇద్దరూ ప్రేమించుకుంటున్నారని, సహజీవనం చేస్తున్నారనీ కూడా చాలా రోజులుగా రూమర్స్ చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఏకంగా నిశ్చితార్థం చేసుకోడం ఇంట్రెస్టింగ్‌గా మారింది.